క్లుప్తంగా

వేరుశనగలో పంటకోత ప్రయోగాలు



ప్రయోగాలను పరిశీలిస్తున్న ఏఎస్‌ఓ

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడి అంచనా నిమిత్తం పంట కోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. మంగళవారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలోని సర్వే నెంబర్ 36–1 బి.జయరామిరెడ్డి పొలంలో ప్రయోగాలను ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ పర్యవేక్షణలో 5×5 విస్తీర్ణంలో చేయగా, దిగుబడి 3 కేజీల 200 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, ఎంపీఈఓ రవికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రఫినాయక్

తలుపుల: మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రఫినాయక్ అధికారులకు సూచించారు. స్థానిక తన చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలో ఓ విలేకరి నకిలీ సర్టిఫికెట్ల కోసం వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 70 నుంచి 80 వరకు నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించాడని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు అర్జీ ఇవ్వనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

నేడు శిక్షణ కార్యక్రమం

తలుపుల: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే విషయంపై శిక్షణ కల్పిస్తారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, జేసీఎస్ కన్వీనర్ టోపీరమణ తెలిపారు.

అక్రమంగా చింతచెట్టు నరికివేత



నరికివేసిన చింతచెట్టు

తనకల్లు: మండల పరిధిలోని మబ్బువారిపల్లి వద్ద మంగళవారం కొందరు వ్యక్తులు అక్రమంగా పెద్ద చింతచెట్టును నరికివేశారని గ్రామస్తులు తెలిపారు. మబ్బు సుబ్బరాయుడుకు, కుమారులకు చెందిన భూమి ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఆ భూమిలోని చింతచెట్టును గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా నరికివేశారని రైతులు వాపోయారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు నరికివేసిన చింతచెట్టును పరిశీలించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్' కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అమడగూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీఎస్ కన్వీనర్ జయప్ప, ఎంపీటీసీ జయమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జౌకలకొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.15 రోజులుగా పంచాయతీ వ్యాప్తంగా టోకెన్లను పొందిన 348 మందికి ఉచితంగా చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. 108 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, 13 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. 72 మందికి ఆయుష్మాన్‌భారత్ కార్డులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఏ ఒక్కరి ఇంట్లో కూడా బాధ పడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి, వైద్యాధికారులు మోనా, అపర్ణ, సర్పంచ్ నరసమ్మ, సొసైటీ అధ్యక్షుడు బొట్టుస్వామి, నక్కలచిన్నప్ప, నాగరాజు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం



కనగానపల్లి మండలం కుర్లపల్లి తండాలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



కదిరి మండలం కేఎన్‌పాళెంలో అద్దాలు అందజేస్తున్న అధికారులు



తనకల్లు: చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: సామాన్యుడికి సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దంపెట్ల గ్రామ సచివాలయ ఆవరణంలో సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, మాదిరెడ్డి పద్మావతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మహోన్నత ఆశయంతో కార్యక్రమాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యులు గంగిరెడ్డి, రామకృష్ణ, స్పెషలిస్టు డాక్టర్స్ గోపిక, సమీరారెడ్డి, వాసంతి ప్రజలకు చికిత్సలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి మనోహర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సీఎస్‌డీటీ శారద, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని కేఎన్‌పాళెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచులు రాఘవేంద్ర, లక్ష్మీనాయక్, లక్ష్మీబాయ్, ఎంపీటీసీ లక్ష్మీదేవిలు ప్రారంభించారు. డాక్టర్ ప్రమీల విద్యాసాగర్, శాంతిస్వరూప్, వినోద్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద రోగులకు అద్దాలు అందజేశారు. జిల్లా మెడికల్ క్యాంప్ నోడల్ అధికారి బాబాఫక్రొద్దీన్, మండల స్పెషలాఫీసర్ సుబ్బారావ్, ఎంపీడీఓ అంజనప్పలు పర్యవేక్షించారు.

తనకల్లు: మండల పరిధిలోని రెడ్డివారిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వైద్య కిట్‌లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేశారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలను చేశారు. ఎంపీడీఓ పూల నరసింహులు, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఈఓఆర్డీ ఆనందయ్య, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ రమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎం అగ్రహారం పంచాయతీ చెవిటివారిపల్లి గ్రామంలో మంగళవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. 314 మందికి గ్రామంలోనే వైద్యులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, మండల కన్వీనర్ బట్టీ హైదర్ వలి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, వైద్యాధికారులు నాగార్జునరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, సానే హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

232 మందికి సేవలు

నల్లమాడ: పేద ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పులగంపల్లిలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పులగంపల్లి, కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లి, యర్రచెరువుపల్లి, వెంకటరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 232 మంది వివిధ రకాల వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఎంపీడీఓ కొండన్న, మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌నాయక్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండలంలోని టీ కుంట్లపల్లిలో మంగళవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, డాక్టర్ భానుప్రకాష్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీటీసీ సూర్యప్రకాష్ నాయుడు, మధుసూదన్‌నాయుడు, సచివాలయ కన్వీనర్ చంద్రమౌళి, పాల్గొన్నారు.

164 మందికి వైద్య పరీక్షలు

కనగానపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం కుర్లపల్లి తండా సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. 164 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రశాంత్‌కుమార్, చైతన్యకుమార్, సుచరిత, ఈఓఆర్డీ అనిల్ కుమార్, ఎంపీహెచ్‌ఈఓ మనోహర్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక సర్పంచ్ విజయ్‌నాయక్, తదితరులు తెలిపారు.



నల్లమాడ: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మీనాక్షి



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు



బత్తలపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

గ్రామాలకే స్పెషలిస్టు డాక్టర్లు



పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని తప్పేటవారిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెగా హెల్త్ క్యాంపును డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. కౌంటర్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి స్పెషలిస్టు డాక్టర్లను ప్రభుత్వం పంపించిందన్నారు. అన్ని పరీక్షలు గ్రామంలోనే ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగేంద్ర నాయక్, లక్ష్మీనారాయణ, హవిలా, వెంకటనారాయణరెడ్డి, ఎంఈఓ రమణ, పంచాయతీ సెక్రటరీ రమణ, అప్తాలమిక్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ లక్ష్మి నరసమ్మ, సూపర్‌వైజర్లు పీఎస్ రవిశంకర్, అలివేలమ్మ, సర్పంచ్‌లు సునీత, మధు, పాపయ్య, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు



పెద్దకోట్లలో వృద్ధులకు పోషకాహారం, గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 471 మంది రోగులకు బీపీ, షుగర్, చర్మం, గొంతు, ముక్కు సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 39 మందిని పలు కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. అనంతరం కంటి సమస్యలు ఉన్న వృద్ధులకు అద్దాలు పంపిణీ చేశారు. పలువురు మహిళలు, వృద్ధులకు కోడిగుడ్లు, పోషక బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రోగులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి సర్పంచులు శ్రీరాములు, పద్మావతి, డాక్టర్లు జ్యోతిర్మయి, కృష్ణప్రసాద్, డెర్మటాలజిస్టు విజయకుమారి, ఈఎన్‌టీ సల్మా, డీటీ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణమోహన్, ఏపీఓ సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ భువనేశ్వరెడ్డి, జొల్లిరెడ్డి రామన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నల్లచెరువు: మండల పరిధిలోని పంతుల చెరువు గ్రామం నుంచి రూ. 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తారు రోడ్డు పనులకు ఎంపీపీ రమణారెడ్డి మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు రెండు గ్రామాలనూ కలుపుతూ తారు రోడ్డు వేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారన్నారు. మాట ప్రకారం రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులను విడుదల చేయించారని తెలిపారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సొసైటీ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకులు వై.రమణారెడ్డి, లక్ష్మీపతి యాదవ్, కరీంఖాన్, విశ్వనాథ్‌రెడ్డి, హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల కడపలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పుట్టపర్తి శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సాయిగీత పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన సుధీర్, విజయ్‌సాయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీన జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు. పీఈటీలు చంద్రిక, అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఓడీచెరువు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మల్లారమ్మ గుడి సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో అక్కడికెళ్లి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

12న వాహనాల వేలం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం కేసుల్లో పట్టుబడిన ఒక ఆటో, రెండు మోటర్ సైకిళ్లను పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ నెల 12న స్టేషన్‌లో బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్సై నరశింహులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి కలవారు ధరావత్తు చెల్లించి వేలం పాడుకోవచ్చునన్నారు.

ప్రేమతో ఆదరిస్తే మానసిక పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మీనాక్షి



ధర్మవరం అర్బన్: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి

ధర్మవరం అర్బన్: మానసిక వికలాంగులను ప్రేమతో ఆదరిస్తే మానసిక పురోగతి సాధ్యమవుతుందని జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, ఎంఈఓ గోపాల్‌నాయక్, డాక్టర్ చంద్రికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బుద్ధిమాంద్య పిల్లలను ప్రేమగా ఆదరించి వారికి మంచి జీవితాన్ని ఇవ్వాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ ప్రేమగా పలకరించాలని సూచించారు. ఫిజియోథెరపిస్టుతో మానసిక వికలాంగులకు పలు రకాల వ్యాయామాలు చేయిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, బిల్లే రవీంద్ర, మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం నాగప్ప, భవిత స్కూల్ టీచర్లు రమాదేవి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఆస్పత్రిలో..

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం ఏర్పాటు చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. ముఖ్య అతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.మీనాక్షి హాజరై మాట్లాడారు. మానసిక రోగులకు ఎటువంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాది నరసింహులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసు సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తపాలా శాఖ అనంతపురం డివిజన్ ఎస్పీ శ్రీ హరిబాబు

ఆత్మకూరు: పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డివిజన్ ఎస్పీ శ్రీహరిబాబు తెలియజేశారు. మంగళవారం ఆత్మకూరు పోస్టాఫీసును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు సద్వినియోగం చేసుకునే సేవలపై వివరించారు. ఆయన మాట్లాడుతూ (డీసీడీపీ) డాక్ కమ్యూనిటీ, డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. పోస్టాఫీసు సిబ్బంది బీమా ప్రీమియంల గురించి, సుకన్య సమృద్ధియోజన పథకం, తపాలా జీవిత బీమా పథకం, ఫిక్స్‌డ్ డిపాజిట్ తదితర పథకాలపై వివరించారు. ఈనెల 13న ఆత్మకూరులో ఏర్పాటు చేయనున్న ఆధార్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచు వరలక్ష్మి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులున్నారు.

సేవలే చిరస్మరణీయం



ఎస్‌ఐ రాంభూపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పనిసరిగా ఉంటాయని, ఉద్యోగి ఆ ప్రాంతానికి చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలిచిపోతాయని వక్తలు కొనియాడారు. మంగళవారం ఓడీచెరువు నుంచి బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ గోపిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీస్ సిబ్బంది సన్మానించారు. సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ రెండున్నరేళ్ల మండలంలో విధులు నిర్వహించిన ఎస్‌ఐ గోపి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్‌భాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటరంగారెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐకి సన్మానం

తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీ అయిన ఎస్‌ఐ రాంభూపాల్‌ను మంగళవారం ఎస్ఎంఎస్ ఫంక్షన్‌హాలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్‌ఐ రాంభూపాల్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. పలు సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో చాలా మర్యాదగా మాట్లాడుతూ సమస్యలను సత్వరం పరిష్కరించేవారని కొనియాడారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రాజశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు శ్రీనివాసులునాయుడు, దేశాయ్ సంజీవరెడ్డి, గణేష్‌రెడ్డి, చిదానందరెడ్డి, దుస్సానీ నీలకంఠారెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థి తిరుగుబాటు!

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓ తరగతిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థి దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తుండగా తరగతి గదిలో విద్యార్థి అల్లరి చేస్తుండటంతో ఉపాధ్యాయుడు మందలించాడు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థి ఎదురు తిరిగాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి పాఠశాలకు చేరుకొని తమ కుమారున్ని మందలించడమే గాక ఉపాధ్యాయుడికి క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగినట్లు తెలిసింది. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల సీజ్

అనంతపురం క్రైం: పాతూరులోని వన్‌వేలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. దుకాణ నిర్వాహకుడు నందపై కేసు నమోదు చేశారు. దాడుల్లో అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఏపుగా పెరిగిన వరి పంటలో రైతు వెంకటరెడ్డి

'సూపర్ బీపీటీ' అదరహో!

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన రైతు కుంట్లో వెంకటరెడ్డి ఇటీవల తన పొలంలో సూపర్ బీపీటీ రకం వరి సాగు చేశారు. సుమారు ఎకరాలో సేంద్రియ ఎరువులు, నానో యూరియా వాడి సాగు చేశారు. మూడు నెలల క్రితం బాగేపల్లి నుంచి విత్తనాన్ని తెచ్చి సాగు చేసిన వరి పంట ప్రస్తుతం నాలుగన్నర అడుగుల ఎత్తు పెరిగి కంకి సైతం బాగా వచ్చింది. దీంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఇటీవల బైరాపురం వెళ్లి పంటను పరిశీలించారు. ఎకరాకు మంచి దిగుబడి అంటే 40 క్వింటాళ్లు రావచ్చని అయితే సూపర్ బీపీటీ సుమారు 60 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన వంగడాలతో మంచి దిగుబడులు సాధించవచ్చని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివ ట్రాక్టర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. మంగళవారం ట్యాంకర్‌లో నీటిని నింపుకునేందుకు వెళ్లాడు. అయితే ట్యాంకు నిండిందో లేదో అని చూసేందుకు ట్యాంకర్‌పైకి ఎక్కాడు. ఈక్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. శివని స్థానికులు 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌పై నుంచి పడి విద్యుత్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లు డీ2 ఏఈ రఘునాథ్, లైన్‌మెన్ నబీరసూల్ గుంతకల్లులో విధులు నిర్వహిస్తారు. సోమవారం అర్ధరాత్రి గుంతకల్లు నుంచి గుత్తికి బైక్‌పై బయలుదేరారు. మార్నేపల్లి శివారులో బైక్ అదుపు తప్పికిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.